సాక్షి పార్వతీపురం మన్యం

గురువారం । 15 । ఫిబ్రవరి । 2024



లోకేష్‌కు కనీస అవగాహన లోపం

టీడీపీ నాయకులు దిక్కుతోచని స్థితిలో ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు అన్నారు. - 8లో



సీపీడబ్ల్యూఎస్ నిర్వహణపై పరిశీలన

రక్షిత మంచినీటి పథకాల ద్వారా నీటి సరఫరా, పైప్‌లైన్ సిస్టమ్ నాణ్యతను క్షేత్రస్థాయిలో తనిఖీ చేస్తున్నట్లు డీఈ రమణప్రభాస్ తెలిపారు. - 8లో



ప్రమాద రహిత రవాణా వ్యవస్థ అందరి బాధ్యత - 8లో

ప్రమాద రహిత రవాణా వ్యవస్థను అందించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ట్రాఫిక్ కమిషనర్ రవీంద్రనాథ్ అన్నారు.

న్యూస్‌రీల్

ఘనంగా 'దామోదరం' జయంతి



నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ కేశవనాయుడు తదితరులు

పార్వతీపురం: దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా బుధవారం నిర్వహించారు. జిల్లా కలెక్టరు సమావేశ మందిరంలో నిర్వహించిన దామోద రం సంజీవయ్య జయంతి కార్యక్రమంలో బుధవారం ఆయన చిత్రపటానికి ఇన్‌చార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్ముడు చూపిన బాటలో సాగుతూ దామోదరం సంజీవయ్య అనతికాలంలోనే అఖిలభారత కాంగ్రెసు కమిటీ (ఏఐసీసీ)కి రెండు దఫాలు అధ్యక్ష పీఠాన్ని అధిష్ఠించారని గుర్తు చేశారు. అతి చిన్నవయస్సులోనే ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో రాజాజీ మంత్రివర్గంలో పనిచేసి, పది సంవత్సరాల రాజకీయానుభవంతో దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాధ్యతలు చేపట్టారని తెలిపారు. తెలుగును అధికార భాషగా ప్రకటించడానికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎల్.రమేష్, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఎం.డి.గయాజుద్దీన్, బీసీ వెల్ఫేర్ అధికారి ఎస్.కృష్ణ, కలెక్టరు కార్యాలయ పరిపాలనాధికారి పి.రామారావు, సూపరింటెండెంట్‌లు వి. సుజాత, బి.చిన్ని కృష్ణ, ఎ.శ్రీనివాసరావు, ఎ. సూర్యనారాయణ, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలలో ఇబ్బందులుంటే చెప్పండి

- ఇన్‌చార్జ్ డీఆర్ఓ కేశవనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఆర్ఓ కేశవనాయుడు

పార్వతీపురం: ప్రస్తుతమున్న పోలింగ్ కేంద్రాలలో ఇబ్బందులు, మార్పులు చేయాలన్నా వెంటనే తెలియజేయాలని ఇన్‌చార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 1500 ఓట్లుకు మించి పోలింగ్ కేంద్రంలో వుంటే మరొక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించదని చెప్పారు. జిల్లాలో 1500 ఓట్లుకు మించిన పోలింగ్ కేంద్రాలు లేవన్నారు. ప్రస్తుతం వున్న పోలింగ్ కేంద్రాలను మార్చవలసి వచ్చినా, భవనం పేరు మారినా, ఎన్నికల నిర్వహణకు అనుకూలంగా లేకున్నా నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే సమావేశంలో తహసీల్దార్‌లు తెలియజేయాలన్నారు. పత్రికలలో వచ్చిన వార్తలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో జనవరి 13వ తేదీ నుంచి 4727 దరఖాస్తులు రాగా, అందులో 26 తిరస్కరణకు గురయ్యాయని, 4450 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆమోదించిన దరఖాస్తులలో 110 చేర్పులు, 13 తొలగింపులు, 123 సవరణలు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాసరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వెలవెలబోయిన లోకేష్ శంఖారావం సభలు

పార్వతీపురం టౌన్: యువగళం పేరుతో ఎన్నికల శంఖారావం పూరించేందుకు వచ్చిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సభలు జనం లేక బోసిపోయాయి. వచ్చిన జనం కూడా లోకేష్ ప్రసంగిస్తుండగానే వెనుదిరిగారు. అధికారంలోకి వస్తే ఏం చేస్తామో చెప్పకుండా ప్రభుత్వంపై విమర్శలకే ఆయన ప్రసంగం పరిమితం కావడంతో క్యాడర్‌లో కూడా నిస్తేజం అలుముకొంది. పార్వతీ పురం మండలం వెంకంపేట గ్రామ సమీపంలో బుధవారం నిర్వహించిన సభకు లోకేష్ కాస్త ఆలస్యంగా రావడంతో ప్రజలు అసహనానికి గురయ్యారు. సభలో లోకేష్ మాట్లాడుతుండగానే కార్యకర్తలు విసుగుచెంది వెనుదిరిగారు. సభాస్థలి వద్దనే టీడీపీ కార్యకర్తలు మందు బాటిళ్లలో హల్‌చల్ చేశారు.

సాలూరులో..

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సాలూరులో నిర్వహించిన శంఖారావం సభ తుస్సుమంది. జనం లేకపోవడంతో జనం కోసం లోకేష్ సభాస్థలి వద్ద వేసిన టెంట్‌లో వేచి ఉన్నారు. తరువాత కొద్దిపాటి జనం చేరడంతో మధ్యాహ్నం 3 గంటలకు సభను ప్రారంభించారు. జనసేన నేతలు తమను పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

సర్కారు బడిలో.. చదువుల క్రతువు

సర్కారు బడి/కళాశాలలో చదువుల క్రతువు నిర్విఘ్నంగా సాగుతోంది. పబ్లిక్ పరీక్షలకు సమయం ఆసన్నమవుతున్న వేళ.. విద్యార్థులు పుస్తకమే ప్రపంచంగా గడుపుతున్నారు. గురువుల వద్ద సబ్జెక్టులో సందేహాలను నివృత్తి చేసుకుంటున్నారు. అధిక మార్కులు సొంతం చేసుకునేందుకు సాధన చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 'జగనన్న ఆణిముత్యాలు' కింద ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక ప్రోత్సహకాలను అందుకోవాలన్న ఆరాటంతో చదువుపై మరింత ఏకాగ్రత చూపుతున్నారు.

- పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు
- ప్రత్యేక తర్ఫీదునిస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు
- అధిక మార్కుల సాధనే లక్ష్యంగా పుస్తకాలతో కుస్తీ
- 'జగనన్న ఆణిముత్యాలు' అవార్డులకు ఎంపికయ్యేలా అభ్యసన



పార్వతీపురం ఉన్నత పాఠశాలలో ఐఎఫ్‌పీ ప్యానల్ ద్వారా విద్యాబోధన చేస్తున్న టీచర్

విజయనగరం డెస్క్: ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. చదువుతోనే విద్యార్థుల భవిత మారుతుందని, సామాజిక ప్రగతి సాధ్యమవుతుందన్న ఉద్దేశంతో చదువులను ప్రోత్సహిస్తోంది. పేద కుటుంబాల పిల్లలు చదువుకునే ప్రభుత్వ బడులను బలోపేతం చేసింది. అమ్మఒడి కింద ఆర్థిక సాయం అందిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యా ప్రణాళికలు అమలు చేస్తోంది. సర్కారు బడి, కళాశాలలో పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో చదువుకుని అధిక మార్కులు సాధించే విద్యార్థులకు 'జగనన్న ఆణిముత్యాలు' కింద నగదు ప్రోత్సాహకాలు అందజేస్తోంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను సత్కరిస్తోంది. పాఠశాలలకు జ్ఞాపికలు అందజేస్తోంది. దీంతో ఉత్తమ ఫలితాల సాధనకు పాఠశాల యాజమాన్యాలు పోటీ పడుతున్నాయి. తమ పాఠశాలల విద్యార్థులను మెరికల్లా తీర్చిదిద్దుతున్నాయి. మార్చిలో జరిగే పరీక్షల పండగకు విద్యార్థులను సంసిద్ధం చేస్తున్నాయి.

పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థుల సంఖ్య

జిల్లా	పదో తరగతి	ఇంటర్మీడియెట్
పార్వతీపురం మన్యం	11,535	17,268 (ఫస్ట్, సెకండియర్)
విజయనగరం	27,277	45,759 (ఫస్ట్, సెకండియర్)

విద్యార్థులనే ఆదర్శంగా తీసుకుని...

గతేడాది 'జగనన్న ఆణిముత్యాలు' పదో తరగతిలో ప్రతిభావంతులైన మొదటి ముగ్గురికి, ఇంటర్మీడియెట్‌లో అధిక మార్కులు సాధించిన గ్రూపునకు ఒక్కరి చొప్పున నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నగదు అవార్డులను అందజేసింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, చదువు చెప్పే గురువులను సత్కరించింది. పాఠశాలల పనితీరును ప్రశంసించింది. ఆ గౌరవం పొందేందుకు, ప్రభుత్వ ప్రోత్సాహకాన్ని అందిపుచ్చుకునేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు సమష్టిగా చదువుల యజ్ఞం సాగిస్తున్నారు. అధిక మార్కుల సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. గతేడాది పదో తరగతిలో వివిధ నియోజకవర్గాల స్థాయిలో అధిక మార్కులు సాధించిన పాడి హేమలత-587, దూడి తభిత-586 (పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల), కర్రి తనుశ్రీ-585 (ఏపీ మోడల్‌స్కూల్, కురుపాం), కర్రి షర్మిల-585 (సాలూరు ఏపీబీసీ వెల్ఫేర్ బాలికల పాఠశాల), దేవకీవాడ ఉమామహేశ్వరి-582(జెడ్పీహెచ్‌స్కూల్, వంతరాం), లెంక జగదీష్-588 (పాగిరి జెడ్పీహెచ్‌స్కూల్), ఇంటర్మీడియెట్‌లో బాకి లిఖితశ్రీ-977(బైపీసీ- మహాత్మా జ్యోతిబాపూలే విద్యాలయం, నెల్లిమర్ల), ఎల్లాపు అంకిత రోజరీ-977(బైపీసీ- ఏపీ మోడల్‌స్కూల్ ఆర్తసపాలెం), లంక నందివర్ధన్-980 (ఎంపీసీ- ఏపీ మోడల్ స్కూల్, సతివాడ), ఎ.జ్యోత్స్న-908 (హెచ్‌ఈసీ- ప్రభుత్వ జూనియర్ కళాశాల, గంట్యాడ) తదితర విద్యార్థుల స్ఫూర్తితో ఈ ఏడాది కూడా అధిక మార్కుల సాధనకు విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదువుతున్నారు.

అవార్డులు ఇలా...

పదో తరగతిలో నియోజకవర్గ స్థాయిలో అధిక మార్కులు సాధించిన మొదటి ముగ్గురు విద్యార్థులకు రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు చొప్పున, జిల్లా స్థాయిలో రూ.50వేలు, రూ.30వేలు, రూ.10వేలు, రాష్ట్ర స్థాయిలో రూ.లక్ష, రూ.75వేలు, రూ.50వేలు చొప్పున నగదు బహుమతులు అందజేస్తుంది. విద్యార్థులకు మెడల్‌తో పాటు వారి తల్లిదండ్రులు, పాఠశాల హెచ్‌ఎంను దుశ్శాలువతో సత్కరిస్తుంది. పాఠశాలకు ప్రత్యేకంగా ఓ జ్ఞాపికను అందజేస్తోంది. ఇంటర్మీడియెట్‌లో అయితే ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ/ఎంఈసీ గ్రూపుల్లో టాపర్లకు నియోజకవర్గ స్థాయిలో రూ.15వేలు, జిల్లా స్థాయిలో రూ.50వేలు, రాష్ట్రస్థాయిలో రూ.లక్ష చొప్పున అందజేస్తుంది.



హద్దుబంగి గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యా బోధన చేస్తున్న టీచర్

అధిక మార్కులు సాధిస్తా..



మా పాఠశాలలో ఉపాధ్యాయులంతా చక్కగా బోధిస్తున్నారు. తరగతి గదిలో ఐఎఫ్‌పీ టీవీల ద్వారా డిజిటల్ బోధనను అందిస్తున్నారు. సబ్జెక్టులకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేస్తున్నారు. గతంతో పోల్చితే పాఠశాలలో విద్యాబోధన మెరుగుపడింది. ట్యాబ్‌ల ద్వారా ఇళ్ల వద్దనే పాఠ్యాంశాలు వింటూ చదువుకుంటున్నాం. ఈ ఏడాది పదో తరగతిలో మంచి మార్కులు సాధిస్తానన్న నమ్మకం ఉంది. జగనన్న ఆణిముత్యాలు అవార్డును అందుకుంటా.

– జి.ఉమేష్‌నాయుడు, పదో తరగతి విద్యార్థి, కేపీఎం పాఠశాల

ప్రథమ స్థానంలో ఉంటాం..



గతేడాది పార్వతీపురం మన్యం జిల్లా ఉత్తీర్ణత స్థానంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది కూడా శతశాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచేలా చర్యలు చేపట్టాం. ప్రతీ ఉన్నత పాఠశాలను అధికారులు దత్తత తీసుకున్నారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ విద్యార్థుల్లో బోధనా సామర్థ్యాలను పరీక్షిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక బోధన తరగతులు నిర్వహిస్తున్నారు.

– పగడాలమ్మ, జిల్లా విద్యాశాఖాధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

స్టేట్ ఫస్ట్ సాధిస్తాం..



ఎప్పటికప్పుడు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. గత సంవత్సరం వలే ఈ సంవత్సరం కూడా మా పాఠశాల నుంచి ఒక స్టూడెంట్ స్టేట్ ఫస్ట్ వచ్చేలా కృషి చేస్తాం. జగనన్న ఆణిముత్యాలు అవార్డులు అందుకోవడంలో భాగస్వాములమవుతాం.

– కె.సుబ్బారావు, హెచ్‌ఎం, దోనుబాయి

అవార్డు సాధిస్తాం..



గతేడాది మా పాఠశాల నుంచి జగనన్న ఆణిముత్యాలు అవార్డుకు ఎంపికయ్యారు. ఈ ఏడాది కూడా శతశాతం ఉత్తీర్ణతతో పాటు విద్యార్థులు అధిక మార్కులు సాధించేలా తర్ఫీదునిస్తున్నాం. స్టడీ అవర్లను నిర్వహిస్తున్నాం. పాఠశాలలో ఐఎఫ్‌పీ ప్యానళ్లు, ట్యాబ్‌ల ద్వారా అందిస్తున్న విద్యాబోధన విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంది.

– ఎర్రా అప్పలనాయుడు, హెచ్‌ఎం, కేపీఎం ఉన్నత పాఠశాల, పార్వతీపురం

సబ్జెక్టుపై పట్టు సాధించేలా..



విద్యార్థులు సబ్జెక్టుపై పట్టు సాధించేలా ప్రతీ పాఠ్యాంశంపై అవగాహనాయుత బోధన అందిస్తున్నాం. సులభంగా పరీక్షలు రాయగలిగేలా తీర్చిదిద్దుతున్నాం. సందేహాలను వెంటనే నివృత్తి చేస్తున్నాం. పాఠశాలలో ప్రత్యేక స్టడీ అవర్లను నిర్వహిస్తున్నాం. ఎన్నడూ లేని విధంగా చదువులో ప్రతిభ చూపే విద్యార్థులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. నగదు అవార్డులు అందుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం.

– జి.విశ్వం, సబ్జెక్టు ఉపాధ్యాయుడు, కేపీఎం పాఠశాల, పార్వతీపురం

కార్పొరేట్‌కు దీటుగా ఏకలవ్య పాఠశాలలు

- రూ. 12కోట్లతో పాఠశాల నిర్మాణం
- ప్రారంభించిన డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



ఏకలవ్య పాఠశాలను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర, పక్కన కలెక్టర్

మక్కువ: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా, ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం తీర్చుదిద్దుతుందని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని అనసభద్ర గ్రామ సమీపంలో సుమారు రూ.12 కోట్లతో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్మించిన ఏకలవ్య పాఠశాలను ఆయనతో పాటు కలెక్టర్ నిషాంత్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ముందుగా ఆవిష్కరించారు. అనంతరం పాఠశాల భవనాన్ని, తరగతి గదులు, డార్మిరేట్ గదులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం రాజన్నదొర మాట్లాడుతూ ఏకలవ్య పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలన్నింటిని ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు మంత్రి రాజన్నదొర సూచించారు. నాడు – నేడు పథకంతో పాఠశాలల రూపురేఖలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మార్చుతున్నారన్నారు. ఏకలవ్య పాఠశాల అప్పటి మంత్రి కిశోర్‌చంద్రదేవ్ హయాంలో మంజూరు కాగా, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పనులు చేపట్టలేదన్నారు. పార్వతీపురం జిల్లాలో నాలుగు పాఠశాల నిర్మాణాలను టీడీపీ పట్టించుకోలేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడ్డాక, పాఠశాల నిర్మాణ పనులకు మోక్షం లభించిందన్నారు. పనులు వేగవంతంగా చేపట్టి, నేడు పాఠశాలను ప్రారంభించుకున్నామన్నారు. కురుపాం మండలంలో ఇంజినీరింగ్ కళాశాల, మెంటాడలో గిరిజన యూనివర్సిటీ, వైద్య కళాశాల, 100, 200 పడకల ఆస్పత్రులు నిర్మిస్తున్నామన్నారు. కలెక్టర్ నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న ఒక్కో విద్యార్థికి సుమారు 90వేల రూపాయిలు ఖర్చు చేస్తుందన్నారు. విద్యార్థుల భవిష్యత్ చక్కగా తీర్చిదిద్దడమే ప్రభుత్వం లక్ష్యమన్నారు. అంతకు ముందు అరకుకు చెందిన గిరిజన మహిళలు థింసా నృత్యంతో వారికి స్వాగతం పలికారు. చిన్నారులు నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. సర్పంచ్ సీదరపు లక్ష్మి, ఎంపీపీ మర్రి పారమ్మ, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, ఎస్ఎస్‌సీ శ్రీనివాస్, ఈఈ శాంతేశ్వరరావు, డీఈ మణిరాజ్, ఏఈ సత్యానారాయణ, ప్రిన్సిపాల్ ఎర్రునాయుడు, ఎంపీడీఓ దేవకుమార్, ఎంఈఓ సత్యనారాయణ, సాలూరు, మక్కువ వైఎస్సార్‌సీపీ నాయుకులు దండి శ్రీనివాసరావు, పూడి దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.



అరకుకు చెందిన గిరిజన మహిళలతో థింసా నృత్యం చేస్తున్న మంత్రి రాజన్నదొర, కలెక్టర్ నిషాంత్‌కుమార్

17లోగా పరీక్ష రుసుం చెల్లించాలి

పార్వతీపురం: హెడ్‌మాస్టర్స్ అకౌంట్ టెస్ట్ పేపర్-1, పేపర్-2లకు పరీక్ష రుసుంను ఈ నెల 17లోగా చెల్లించాలని డీఈఓ జి.పగడాలమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక పేపర్‌కు రూ.100లు, రెండు పేపర్లకు రూ.150లు చెల్లించాలన్నారు. రూ.60లు అపరాధ రుసుంతో ఈ నెల 22వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్ష రుసుంను గేట్‌వే ద్వారా చెల్లించాలన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బిఎస్ఇ.ఏపి.జిఓవి.ఇన్‌లో అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తిచేసిన దరఖాస్తులను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని డీఈఓ పగడాలమ్మ సూచించారు.

16న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

కొత్తవలస: మంగళపాలెం గ్రామంలో శ్రీ వీరాంజనేయ తీర్థం సందర్భంగా గౌరీ సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను శుక్రవారం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభవుతాయని తెలిపారు.

సేవలకు సత్కారం

- నిస్వార్థంగా ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లు
- ఉత్తమ సేవలందిస్తున్న వలంటీర్లకు నేటి నుంచి సత్కారాలు
- జిల్లాలో 5,554 మంది గ్రామ/వార్డు వలంటీర్లు
- 20 మందికి సేవావజ్ర, 90 మందికి సేవారత్న, 5,368 మందికి సేవామిత్ర పురస్కారాలు

పార్వతీపురం టౌన్:

వలంటీర్లు.. అధికారులకు ప్రజలకు మధ్య వారధిలాంటివారు. అర్హులకు సంక్షేమ పథకాల చేరవేతలో గురుతర బాధ్యత వహిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం చేయడంలో కీలక భూమిక పోషిస్తున్నారు. ఊరూరా.. వార్డు వార్డులో ప్రజా సేవకులుగా ముందుకు సాగుతున్నారు. ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు. వారి సేవలను గుర్తించి సత్కరించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. పురస్కారాలతో గౌరవించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. నేటి నుంచి ఆర్థిక ప్రోత్సాహకాలు అందజేయనుంది. పార్వతీపురం మన్యం జిల్లాలో మొత్తం 5,554 మంది వలంటీర్లు ఉండగా అందులో 78 ఖాళీలు ఉన్నాయి. వీరిలో ఏడాది పాటు విధులు నిర్వహించిన వారికి అవార్డులు ఇవ్వనుంది. వీరి ఖాతాల్లో నేటి నుంచి రూ.8.41 కోట్ల ఆర్థిక ప్రోత్సాహాన్ని జమ చేయనుంది.

20 మందికి సేవావజ్ర

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ సేవలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వలంటీర్లకు సేవా వజ్ర అవార్డును అందజేస్తారు. జిల్లాలో మొత్తం 20 మందిని ఎంపిక చేశారు. వీరికి ఒకొక్కరికి రూ.45 వేలు ప్రోత్సాహం అందించి శాలువతో సన్మానం చేయనున్నారు. ఈ లెక్కన వీరందరికీ రూ.9 లక్షల నగదు, ప్రశంసా పత్రాన్ని, మెడల్, బ్యాడ్జిని అందజేయనున్నారు.



వృద్ధులకు సేవలందిస్తున్న వలంటీరు (ఫైల్)

90 మందికి సేవారత్న

ప్రతి మండలం, మున్సిపాలిటీ నుంచి ఒక్కో వలంటీరు సేవా రత్న పురస్కారానికి ఎంపిక చేశారు. వీరికి ఒక్కొక్కరికి రూ.30 వేల నగదు, ప్రశంసాపత్రం అందజేయనున్నారు. జిల్లాలో మొత్తం 90 మందికి రూ.27 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది.

5,368 మందికి సేవామిత్ర

వలంటీరుగా విధుల్లో చేరి ఏడాదికి పైగా సేవలందించి, ఎటువంటి ఫిర్యాదు లేని ప్రతి వలంటీరుకు సేవామిత్ర పురస్కారం అందజేస్తారు. ఒక్కొక్కరికి రూ.15 వేలు నగదు, బ్యాడ్జి, శాలువాతో సత్కరించనున్నారు. జిల్లాలో ఈ అవార్డుకు 5368 మంది అర్హత కలిగిన వలంటీర్లు ఉన్నారు.

రోజుకు రెండు సచివాలయాల్లో...

ఈ నెల 15 నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమాన్ని రెండు రోజుల పాటు వార్డు, గ్రామ సచివాలయాల్లో నిర్వహించాలని, దీనికి అవసరమైన కార్యాచరణను రూపొందించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. అందుకు తగ్గ ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశారు.

పారదర్శకంగా ఎంపిక చేశాం



వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయం. వారు చేసిన సేవల ఆధారంగా సేవా వజ్ర, సేవారత్న, సేవామిత్రలను పారదర్శకంగా ఎంపిక చేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు నేటి నుంచి నుంచి ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో సమావేశాలు నిర్వహిస్తాం. ఎంపికైన వలంటీర్లకు పురస్కారాలు అందజేస్తాం.

– రామచంద్రరావు, జీఎస్‌డబ్ల్యూఎస్, జిల్లా అధికారి, పార్వతీపురం మన్యం

జిల్లాలో అవార్డుల పంపిణీ ఇలా..

మండలం	సేవా వజ్ర	సేవా రత్న	సేవా మిత్ర
పార్వతీపురం అర్బన్	0	5	258
సాలూరు అర్బన్	1	5	236
పాలకొండ అర్బన్	1	5	138
వీరఘట్టం	0	5	399
సీతంపేట	2	5	435
భామిని	1	5	238
పాలకొండ	1	5	265
కొమరాడ	2	5	302
గుమ్మలక్ష్మీపురం	2	5	346
కురుపాం	1	5	291
జియ్యమ్మవలస	0	5	294
గరుగుబిల్లి	0	5	247
పార్వతీపురం	2	5	334
మక్కువ	2	5	331
సీతానగరం	2	5	298
బలిజిపేట	1	5	377
సాలూరు	2	5	319
పాచిపెంట	0	5	266

క్లుప్తంగా

పైడితల్లి నిత్యన్నదానానికి లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న కామేశ్వరరావును సత్కరిస్తున్న ఆలయ అధికారులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యై దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడి తల్లి అమ్మవారి నిత్యన్నదానానికి బొడ్డవలస గ్రామానికి చెందిన కె.కామేశ్వరరావు, ఆయన సతీమణి హైమావతి జ్ఞాపకార్థం రూ.లక్ష విరాళం బుధవారం అందజేశారు. పైడితల్లి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ సూపర్‌వైజర్‌లు ఏడుకొండలు, సూర్యనారాయణలకు విరాళం అందజేశారు. అమ్మవారి ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు ఏడిద రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగికి ఎస్ఈ అభినందన



పైడిరాజును అభినందిస్తున్న ఎస్ఈ మువ్వల లక్ష్మణరావు

విజయనగరం: జిల్లాస్థాయిలో జరిగిన మాస్టర్స్ షటిల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాజమండ్రిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యుత్ ఉద్యోగిని ఏపీఈపీడీసీఎల్ విజయనగరం ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ మువ్వల లక్ష్మణరావు బుధవారం అభినందించారు. ఇటీవల జరిగిన పోటీల్లో 50 ప్లస్ విభాగంలో పాల్గొన్న రికార్డ్ అసిస్టెంట్ పి.పైడిరాజు సింగిల్స్‌లో ప్రథమ స్థానం, డబుల్స్‌లో ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. ఈ మేరకు ఎస్ఈ మువ్వల లక్ష్మణరావు అభినందిస్తూ రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి పి.హరి, కార్యదర్శి వి.మోహన్ బాబు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి హుండీ చోరీ



దుండగులు విరగ్గొట్టిన హుండీ

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ జంక్షన్ వద్ద గల అభయాంజనేయస్వామి ఆలయంలోని హుండీలో గల సొమ్మును గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం చోరీ చేశారు. అర్ధరాత్రి సుమారు ఒంటిగంట సమయంలో ఆలయం వద్ద గల విద్యుత్ వైర్లు కట్ చేయడంతో ఆప్రాంతమంతా చీకటి అలుముకుంది. అనంతరం గునపం సహాయంతో హుండీని పెకిలించి విరగ్గొట్టి హుండీలో ఉన్న సుమారు రూ. 10 వేలు దోచుకుపోయారు. దీంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

40 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు



సీజ్ చేసిన మద్యం సీసాలతో నిందితుడిని చూపిస్తున్న ఎస్సై గోపాలరావు

లక్కవరపుకోట: మండలంలోని అరకు–విశాఖ రోడ్డులో గోల్డ్‌స్టార్ జంక్షన్ వద్ద ఎస్సై ఆర్.గోపాలరావు ఆధ్వర్యంలో బుధవారం వాహనాలు, షాపుల్లో తనిఖీలు నిర్వహించి బి.నాయుడు పాన్‌షాపులో అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో షాపులో తనిఖీ చేసి 40 మద్యం సీసాలు పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. దీంతో మద్యం సీసాలను సీజ్ చేసి నిందితుడు నాయుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్సై శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹135	₹240	₹ 250

లోకేష్‌కు కనీస అవగాహన లోపం

- తప్పుడు ఆరోపణల కోసమే శంఖారావం
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు

పాలకొండ: ప్రజలు చీదరించుకున్న టీడీపీ నాయకులు దిక్కుతోచని స్థితిలో ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడంలేదని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, అరకు పార్లమెంట్ సమన్వయకర్త, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు విమర్శించారు. ఈ మేరకు బుధవారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం నివాసం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో లోకేష్ శంఖారావం యాత్రలో చేసిన ఆరోపణలను ఖండించారు. పాలకొండ నియోజకవర్గంలో అభివృద్ధి అంటే అప్పటి దివంగత నేత వైఎస్‌రాజశేఖరరెడ్డి సమయంలోను, ప్రస్తుతం జగన్‌మోహనరెడ్డి పాలనలోను జరిగిందన్నారు. లోకేష్, నియోజకవర్గ ఇన్‌చార్జి జయకృష్ణలు కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. వాస్తవాలు తెలుసుకుని సభల్లో మాట్లాడాలని హితవు పలికారు. కేవలం వైఎస్సార్‌సీపీ నాయకులను తిట్టడం కోసంమే శంఖారావం పేరుతో లోకేష్ తిరుగుతున్నారన్నారు. పార్టీ ఫండ్ కోసం జయకృష్ణ పాకులాడుతున్నారని, ప్రజల సమస్యలపై కోసం కాదన్నారు. విమర్శించారు. టీడీపీ అధికారంలో ఉండగా నియోజకవర్గం ఇన్ చార్జిగా గిరిజనుల సొమ్మును జయకృష్ణ దోచుకోలేదా? అని ప్రశ్నించారు. పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధి ఒక్క జగన్‌మోహనరెడ్డి పాలనలోనే జరిగిందన్నారు. మీకు గిరిజనుల సమస్యలపై కనీసం అవగాహన ఉందా? అని ప్రశ్నించారు. అరకు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని 7నియోజవకర్గాల్లో ఒక్క సీటు అయినా టీడీపీ గెలవగలదా? అని ఎద్దేవా చేశారు. సమావేశంలో నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మార్కెట్ కమిటీ చైర్మన్, కార్పరేషన్ల సభ్యులు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగులూ ప్రభుత్వంలో భాగస్వాములే

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: ఉద్యోగులూ ప్రభుత్వంలో భాగస్వాములేనని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పరిషత్ ప్రాంగణంలో జిల్లా పరిషత్ నిధులు సుమారు రూ. 9 లక్షలతో ఆధునీకరించిన ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం భవనాన్ని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయడానికి, ఉద్యోగుల సంపూర్ణ సహకారమే కారణమని ప్రశంసించారు. ఉద్యోగుల సహకారం లేనిదే ఏ కార్యక్రమం ముందుకు వెళ్లదన్నారు. ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని, వారి కష్టసుఖాల పట్ల వెన్నంటి నిలుస్తున్నామని చెప్పారు. మినిస్టీరియల్ భవనాన్ని అన్ని వసతులతో అందంగా తీర్చిదిద్దారని అభినందించారు. భవన నిర్వాహణలో ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో కె.రాజ్‌కుమార్, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు చింతాడ మురళి, కార్యదర్శి వంగపండు రాంబాబు, అసోసియేట్ అధ్యక్షుడు కేబీ శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు, జిల్లా పరిషత్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: ఏపీ గిరిజన గురుకుల సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాలయంలో 2024–25 విద్యాసంవత్సరానికి రాత పరీక్ష ద్వారా 5వ తరగతి, 6 నుంచి 9వ తరగతివరకు ఆంగ్లమాధ్యమంలో మిగిలిఉన్న సీట్లకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోనవలస (బాలురు)లో 5వ తరగతి 80 సీట్లు, 6వ తరగతి 5 సీట్లు, 9వ తరగతి 3 సీట్లు ఉన్నాయి. అలాగే కురుపాం (బాలికలు)లో 5వ తరగతి 80 సీట్లు, 6వ తరగతి 1, 8వ తరగతిలో 1, 9వ తరగతిలో రెండు సీట్లు ఉన్నాయి. భద్రగిరి (బాలురు)లో 5వ తరగతి 80 సీట్లు, 6వ తరగతి 4 సీట్లు, 7వ తరగతి 8, 8వ తరగతిలో 3, 9వ తరగతిలో 3 సీట్లు ఉన్నాయి. కొమరాడ (బాలురు)లో 5వ తరతి 80 సీట్లు, 6, 7వ తరగతిలో చెరొకటి, 8వ తరగతిలో 3, 9వ తరగతిలో రెండు సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏపీటీడబ్ల్యూగురుకులం.ఏపీ.జీఓవీ.ఇన్‌లో సీటు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కామన్ ఎంట్రన్స్ పరీక్ష ఏప్రిల్ 21న ఆయాపాఠశాలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు కన్వీనర్ ప్రిన్సిపాల్ 9490957218, గురుకులం సెల్ ఇన్‌చార్జ్ 9490971090 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సీపీడబ్ల్యూఎస్ నిర్వహణపై పరిశీలన



వెంకటాపురం రక్షితమంచి నీటి పథకాలను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ డీఈ రమణ ప్రభాస్

గజపతినగరం: రక్షిత మంచినీటి (మేజర్,మైనర్) పథకాల ద్వారా నీటి సరఫరా, పైప్‌లైన్ సిస్టమ్ నాణ్యతను క్షేత్రస్థాయిలో తనిఖీ చేస్తున్నట్లు జిల్లా నీటి పారుదల శాఖ క్వాలిటీ కంట్రోల్ డీఈ రమణప్రభాస్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన గజపతినగరం మండల కేంద్రంలోని ఎం.వెంకటాపురం సమీపంలో చంపావతి నది వద్ద ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకాలను, పంప్‌హౌస్‌లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఇక్కడి నుంచి నీటి సరఫరా జరుగుతున్న గ్రామాల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు, నీటి సమస్యలు తలెత్తకుండా సిబ్బంది చూసుకోవాలని సూచించారు. అనంతరం వెంకటాపురం చంపావతి నదివద్ద ఏర్పాటు చేసిన సీపీడబ్ల్యూఎస్ గోస్తని, గిట్టుపల్లి స్కీమ్స్‌ను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో క్వాలిటీకంట్రోల్ జేఈ టి.రాజేష్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వీరఘట్టం: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ పంచాయతీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు వై.వి.నాయుడు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన వీరఘట్టంలో పంచాయతీ వర్కర్లతో సమావేశమయ్యారు. పనిభారం పెరుగుతున్నందున కార్మికులను పెంచాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పోలమాంబ నాల్గవ జాతర ఆదాయం లెక్కింపు

మక్కువ: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి నాల్గవ జాతర ఆదాయాన్ని ఈవో వీవీ సూర్యనారాయణ పర్యవేక్షణలో బుధవారం లెక్కించారు. ప్రత్యేక దర్శనం, శీఘ్ర దర్శనం, కేశఖండన, లడ్డు, పులిహోర ప్రసాదం, అన్నదాన విరాళం ద్వారా రూ.8,32,838 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను వచ్చే వారం లెక్కించునున్నట్లు ఈవో సూర్యనారాయణ చెప్పారు. లెక్కింపు కార్యక్రమంలో దేవదాయశాఖ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆలయాల్లో చోరీ చేసిన ముద్దాయికి జైలు శిక్ష

మక్కువ: స్థానిక భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయం, ములక్కాయవలస గ్రామంలోని కాశీ విశ్వేశ్వర ఆలయంలో చోరీకి పాల్పడిన ముద్దాయికి 8 నెలల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ సాలూరు కోర్టు బుధవారం తీర్పు నిచ్చినట్లు ఎస్సై నరసింహమూర్తి తెలిపారు. 2019లో రెండు ఆలయాల్లో చోరీ జరగడంతో, అప్పటి ఎస్సై షేక్ శంకర్ కేసు నమోదు చేశారు. మక్కువకు చెందిన చిన్న గొడబ జగదీష్ చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించి, అరెస్టు చేసి వస్తువులను రికవరీ చేసి కేసు ఫైల్ చేశారు. ఈ కేసుపై సాలూరు మెజిస్ట్రేట్ కె.రమేష్ విచారణ జరిపి పై విధంగా తీర్పు వెలువరించారు.

జేఏఎస్ శిబిరాల్లో మెరుగైన సేవలు అందించండి

- డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు



మహిళతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్ఓ భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక పూల్‌బాగ్‌లో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిబిరం నిర్వహించడానికి ముందు సంబంధిత గ్రామం, వార్డుల్లో విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన వైద్య పరీక్షలు చేయాలని చెప్పారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారిని రిఫర్ చేయాలని సూచించారు. వైద్య శిబిరానికి వచ్చే రోగులు ఇబ్బంది పడకుండా టెంట్, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎపిడిమాలజిస్టు డాక్టర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బైక్, వ్యాన్ ఢీకొని యువకుడి మృతి

- చికిత్స పొందుతున్న మరో ఇద్దరు యువకులు



మృతిచెందిన కరుణ్ (ఫైల్)



అపస్మారక స్థితిలో దిలీప్



మరో బాధితుడు హరి



ప్రమాదస్థలివద్ద రక్తపు మడుగులో యువకులు

రేగిడి: మండలంలోని సంకిలి వద్ద ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురు ఇంటర్మీడియట్ విద్యార్థులను ఐషర్ వ్యాన్ ఢీకొనడంతో బుధవారం జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా మరో యువకుడు తీవ్ర గాయాల పాలై అపస్మాకర స్థితికి చేరుకున్నాడు. ఇంకో యువకుడు చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. రేగిడి మండలంలోని మజ్జిరాముడు పేట గ్రామానికి చెందిన బలివాడ కరుణ్, పొట్నూరు దిలీప్, బలివాడ హరిలు ద్విచక్రవాహనంపై మజ్జిరాముడు పేట గ్రామం నుంచి పాలకొండ వెళ్తున్నారు. అదే సమయంలో సంకిలి చక్కెర కర్మాగారానికి గోనె సంచులు తీసుకెళ్లేందుకు వచ్చిన ఐషర్ వ్యాన్ డ్రైవర్ ఫ్యాక్టరీ వద్ద రివర్స్ చేస్తుండడంతో బైక్, వాహనం పరస్పరం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బలివాడ కరుణ్(17) అక్కడికక్కడే మృతిచెందగా, పొట్నూరు దిలీప్, బలివాడ హరిలకు తీవ్ర గాయాలయ్యాయి. రక్తపు మడుగులో ఉన్న యువకులను చూసిన మజ్జిరాముడుపేట గ్రామ సర్పంచ్ కరణం శ్రీనివాసరావు 108 వాహనానికి సమాచారం అందించి, వాహనం ద్వారా పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం వారి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దిలీప్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం శ్రీకాకుళం ఆస్పత్రికి అక్కడి వైద్యులు రిఫర్ చేశారు. చికిత్స అందుతుండగానే దిలీప్ అపస్మారకస్థికి చేరుకున్నాడు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ట్రైనీ డీఎస్పీ

ప్రమాదం జరిగిన స్థలాన్ని బొబ్బిలి ట్రైనీ డీఎస్పీ ఎస్.మహేంద్ర, రాజాం రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై ఇ.శ్రీనివాసరావులు పరిశీలించారు. వ్యాన్ డ్రైవర్ వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని వ్యక్తి...



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఉన్న రిజర్వేషన్ కౌంటర్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు వన్‌టౌన్ పోలీసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతుడు సుమారు 50 నుంచి 55 ఏళ్ల వయసు కలిగి ఉన్నాడని, సమీపంలో విచారణ చేయగా ఎటువంటి వివరాలు తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. బంధువులు ఎవరైనా గుర్తిస్తే తమను సంప్రదించాలని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు కోరారు.

బీసీ రిజర్వేషన్ కల్పించాలి

- తెలగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు
- కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష ప్రారంభం



కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్షలో పాల్గొన్న చనుమల్ల ప్రసాదరావు, తదితరులు

విజయనగరం టౌన్: తెలగ కులస్తులకు బీసీ రిజర్వేషన్ కల్పించాలని ఉత్తరాంధ్రా తెలగ సంక్షేమ సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షుడు చనుమల్ల ప్రసాదరావు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద బుధవారం నిరాహార దీక్షను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1915 నుంచి 1966 వరకూ ఉన్న బీసీ రిజర్వేషన్‌లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. శనివారం వరకూ నిరాహారదీక్షలు చేపట్టనున్నామని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రాలో తెలగాలు, కోస్తా జిల్లాల్లో పెద కాపులు, రాయలసీమలో బలిజలు, సర్కారు జిల్లాల్లో ఒంటరులు అంతా ఒక్కటే కులమని స్పష్టం చేశారు. వారంతా ఆర్థికంగా వెనుకబడిన వారేనని, తప్పనిసరిగా వారందరికీ రిజర్వేషన్‌లు కావాలని, ఆ దిశగా ప్రభుత్వం కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పలువురు తెలగ సంఘం ప్రతినిధులు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో పట్టణ తెలగ సంఘం నాయకుడు తీగల హరినాథ్, తాడి నానాజీ, మహిళా సంఘం నాయకులు పూనిశెట్టి శాంతి, రమణమ్మ, నందమూరి రమణమూర్తి, రామారావు కూనిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా: పలువురికి గాయాలు



బోల్తాపడిన ఆటో

గరుగుబిల్లి: వివాహ నిశ్చితార్థానికి వెళ్తున్న ఆటో ప్రమాదవశాత్తు బోల్తా పడడంతో పలువురికి గాయాలయ్యాయి. తెర్లాం మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన పదిహేను మంది ఆటోలో వంగర మీదుగా జియ్యమ్మవలస మండలంలోని గౌరీపురం గ్రామానికి నిశ్చితార్థం కార్యక్రమానికి వస్తుండగా గరుగుబిల్లి మండలంలోని చిలకాం ప్రధాన రహదారి మలుపు వద్ద ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కొందరికి తీవ్రగాయాలు కావడంతో, 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ప్రమాద రహిత రవాణా వ్యవస్థ అందరి బాధ్యత

- ట్రాఫిక్ కమిషనర్ రవీంద్రనాథ్
- ఆర్టీసీలో ముగిసిన రోడ్డు భద్రతా మాసోత్సవాలు
- ఉత్తమ డ్రైవర్లకు సత్కారం



సత్కారం పొందిన ఉత్తమ డ్రైవర్లు

విజయనగరం అర్బన్: ప్రమాద రహిత రవాణా వ్యవస్థను అందించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అందుకు అందరూ బాధ్యత వహించాలని ట్రాఫిక్ కమిషనర్ రవీంద్రనాథ్ అన్నారు. జిల్లా స్థాయిలో ఆర్టీసీ నిర్వహించిన రహదారి భద్రతా మాసోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ మేరకు స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజ్ ఆవరణలో జరిగిన ముగింపు సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను చైతన్య పరచాలనే లక్ష్యంతో ఇప్పటి వరకు నిర్వహించిన వారోత్సవాలను పొడిగిస్తూ ఈ ఏడాది నుంచి మాసోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. 2022లో ఆర్టీసీ, సాధారణ రవాణాల్లో జరిగిన 700 ప్రమాద సంఘటనల్లో 250 వరకు మరణాలు సంభవించాయని తెలియజేశారు. అయితే గత ఏడాది 2023లో జరిగిన 650 ప్రమాదాల్లో కేవలం 150 మంది మాత్రమే మరణించారని మరణాల రేటు తగ్గించగలిగామని, అందుకు ఆర్టీసీ డ్రైవర్లను అభినందించాలన్నారు. అనంతరం ఉత్తమ సేవలను అందిచిన జోన్, డిపోల స్థాయిలోని డ్రైవర్లను ఘనంగా సత్కరించారు. రోడ్డు ప్రమాదాల నివారణ అంశంపై పాఠశాల స్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో విజేతలు 15 మందికి బహుతులు అందజేశారు. జిల్లా ప్రజా రవాణా అధికారి సీహెచ్.అప్పలనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ఆర్టీసీ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.రవికుమార్, డిప్యూటీ సీటీఎం కొటాన శ్రీనివాసరావు, డిపో మేనేజర్‌లు జే.శ్రీనివాసరావు, కె.రమేష్, సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

16, 17తేదీల్లో జీఎంఆర్ ఐటీలో స్టెప్‌కాన్ సదస్సు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గిరీష్ తదితరులు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ ఐటీలో ఈ నెల 16, 17తేదీల్లో స్టెప్‌కాన్ 16వ జాతీయ సదస్సు నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ ఎస్‌వీ ప్రసాద్, జీఎంఆర్ వీఎఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్‌లు తెలిపారు. ఈ మేరకు బుధవారం కళాశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాన్యుని ఆధీనంలో కృత్రిమ మేధస్సు అనే అంశంతో నిర్వహించనున్న ఈ సదస్సును విశాఖపట్నంకు బార్క్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు లాంఛనంగా ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. ఏటా జరుగుతున్న ఈ స్టెప్‌కాన్‌కు ఆదరణ పెరుగుతోందన్నారు. విద్యార్థులు అత్యంత ఉత్సాహంగా పాల్గొని నూతన ఆవిష్కరణలు ప్రదర్శించనున్నారని చెప్పారు. సమావేశంలో కన్వీనర్ డాక్టర్ టీఎస్ కిశోర్, డాక్టర్ బి.అనిల్‌కుమార్, కేవీఎస్ ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం ప్రవేశాలకు నోటిఫికేషన్

విజయనగరం అర్బన్: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ప్రభుత్వ సీట్ల కోసం నోటిఫికేషన్ విడుదలైందని డీఈఓ ఎన్.ప్రేమకుమార్ తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరానికి గాను జిల్లాలో గల అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశానికి 25 శాతం ఉచిత సీట్లు కల్పించమని కమిషనరీ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ జారీ చేసిన ఉత్తర్వుల నేపథ్యంలో ఈ ప్రవేశాలు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నామని తెలిపారు. ప్రవేశాలకు 'సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్' పోర్టల్‌లో నమోదు షెడ్యూల్ విడుదల చేశారు. స్కూళ్లను ఎంపిక చేసుకుని నమోదు చేసుకోవడానికి ఈ నెల 20వ తేదీవరకు అవకాశం ఉందని తెలిపారు. అదే విధంగా పోర్టల్‌లో విద్యార్థుల వివరాలను ఈ నెల 23 నుంచి మార్చి 14వ తేదీ వరకు నమోదు చేసుకోవాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాల డేటా ద్వారా ప్రవేశానికి విద్యార్థుల అర్హత నిర్ధారణకు మార్చి 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు షెడ్యూల్ ఉందని వివరించారు. సీట్ల ఎంపిక లాటరీ తొలి రౌండ్ ఫలితాలను ఏప్రిల్ 1వ తేదీన ప్రచురిస్తామని పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాల నిర్ధారణ తేదీలు ఏప్రిల్ 2 నుంచి 10వ తేదీ మధ్య ఉంటాయన్నారు. రెండవ రౌండ్ లాటరీ ఫలితాల ప్రచురణ ఏప్రిల్ 15 తేదీన ఉంటుందని, విద్యార్థుల తుది ప్రవేశాలు ఏప్రిల్ 16 నుంచి 23వ తేదీల మధ్య ఉంటాయని ప్రకటించినట్లు డీఈఓ తెలిపారు.

రామనారాయణంలో ఘనంగా అక్షరాభ్యాసం

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో జ్ఞాన సరస్వతీదేవి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని (వసంత పంచమి) సందర్భంగా బుధవారం సామూహిక అక్షరాభ్యాసం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీణాపాణి జ్ఞాన సరస్వతీదేవికి విశేష పూజలు చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.